# సువార్త

## The Gospel

**పాఠ్యోద్దేశము:** సువార్త, విశ్వాసమును కలిగించుటకై దేవుని శక్తియైయున్నదని తెలియ జేయుట.

**లేఖనము:**

*సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన - నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది.*

*రోమా 1:16,17.*

### పాఠము

ఈ రెండు వచనములు ఒకదాని తర్వాత ఒకటి చదువబడి అభ్యాసము చేయ బడవలెను. ప్రతి పదమును తప్పక అర్థం చేసుకొనవలెను. మనము రోమా పత్రిక చదువుచుండగా అవి మన మనస్సులో సజీవముగా దాచబడియుండాలి. ఈ గొప్ప పత్రికను అభినందించుటకై "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అనునది అంశముగా పరిగణించెదము. దీని గూర్చి ఒక్కసారి ఆలోచించుము. నేను రక్షించబడిన ఈ వ్యక్తిగా నుండగలను. నేను దేవుని విషయమై సజీవముగా నుండగలను. నేను నీతిమంతునిగా నుండగలను. అయితే పాపినైన నాకు, ఈ విషయములన్నీ ఎలా జరుగును?

*కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము. మరియు ఆయన ద్వారా మనము విశ్వాసము వలన ఈ **కృపయందు** ప్రవేశము గలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమను గూర్చిన నిరీక్షణను బట్టి అతిశయపడుచున్నాము.* *రోమా. 5:1,2.*

క్రైస్తవుల విశ్వాసమును బట్టి దేవుడు మనలను సజీవులుగా చేసి నీతిమంతులుగా ఎంచును. అయితే ఇది అంతయు ఎలా జరుగును మరియు ఎందుకు జరుగును అను దానిని గూర్చియే రోమా పత్రిక ఉన్నది. ప్రారంభము నుండి ముగింపు వరకు అది దేవుని ప్రణాళికయు దేవుని శక్తియై యున్నది. "దేవుని కృపలోనికి మనలను ప్రవేశింపచేసినది మన విశ్వాసమే" అని మనం వాదించవచ్చు. అది నిజమే, అయినను పౌలు చెప్పాడు: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది." శక్తి సువార్త యందు ఉన్నది, మనయందు కాదు. సువార్త అనగా శుభవార్త. మన ప్రభువైన యేసుక్రీస్తు గురించి ప్రవక్తల ద్వారా ముందుగానే శుభవార్త వాగ్దానము చేయబడినది. ఆయన దేవుని కుమారునిగా ప్రకటింపబడెను మరియు ప్రకటింపబడిన దానియందున్న శక్తిచేత ఆయన మరణము నుండి పునరుత్థానుడయ్యెను (రోమా 1:1-4).

మనము "ఆదామునందు" జన్మించియుంటిమి. మనము గనుక పరిపక్వత కలిగిన మనస్సు, హృదయము మరియు మనస్సాక్షిని కలిగియున్నవారమైతే మనము పాపము చేసియుంటిమి మరియు మన ప్రస్తుత నివాసము రోమా. 5:21లో సంక్షిప్త పరచబడింది -"మరణములో పాపము ఏలును." మనము ఆత్మీయముగా మరణించినవారము మరియు భౌతిక మరణము యొక్క గొప్ప భయములో ఉన్నాము (హెబ్రీ. 2:14,15). మనము దేవుని నుండి వేరు చేయబడితిమి. మన జీవితములో మనల్ని మనము సంతృప్తిపరచుకొనుటకు ఎంతగానో ప్రయత్నిస్తున్నాము. కాని ప్రతిసారి మంచిని ఎంచుకొనుటలో విఫలమవుతున్నాము. అదియే పాపము. పాపము మన జీవితాలను అధిగమించి మనలను శక్తిహీనులుగా చేయును. మనము నీతిమంతులుగా ఉండుటకు ప్రయత్నించవచ్చు, కాని మనము నీతి విషయమై మరణించిన వారము (రోమా 6:20). లోకములో "ఆదామునందున్న" పరిపక్వత చెందిన వ్యక్తి జీవితములో కూడా విశ్వాసము కన్పించుట లేదు. జీవితము, అది నిజమైన జీవితమా? "మరణము" దానిని చక్కగా వివరించలేదా? పౌలు వ్రాసిన ఎఫెసీ పత్రికలో అతడు అన్నాడు, "మీ అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చినవారైయుండగా..." (ఎఫెసీ. 2:1).

"నిత్యత్వము నుండి నిత్యత్వమునకు" అను మన మొదటి పాఠములో గుర్తుచేసుకొనుము. ఆదామునందు ఉన్న మానవునికి ఒకే ఒక్క పదము ఉన్నది. ఆ పదము "పిలిచెను." (రోమా 8:30). ఆదామునందున్న పరిపక్వత గల ప్రజలందరు మరణించినవారు మరియు పాపము వారి యజమాని. అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). అయితే మానవుని కొరకైన దేవుని ప్రణాళిక విఫలమయ్యిందని కాని, నిష్ప్రయోజనమయ్యిందని కాని దాని అర్థము కాదు.

దేవుని సువార్తీకరణ కార్యక్రమము అనునది ప్రత్యేకముగా, పాపము వలన మరణించి పాపము చేత ఏలబడుచున్న "ఆదామునందు" ఉన్న మానవుని కొరకై యున్నది. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు సువార్త (శుభవార్త) కు మూలమై యున్నాడు. దేవుడు "ఆదామునందు" ఉన్న మనుష్యుడ్ని సువార్తతో పిలుస్తున్నాడు 2 థెస్స. 2:14 చూడుము. లోకములో "ఆదామునందు" ఉన్న మనుష్యుడ్ని, పాపము, మరణము, ధర్మశాస్త్రము మరియు దేవుని ఉగ్రత అనేటటువంటి సమస్యలన్నిటి నుండి రక్షించుటకు సువార్త అనునది దేవుని శక్తియై యున్నది.

మానవాళి పరలోకమునకు వెళ్ళుటకు ఇది ప్రవేశము కల్పించదు. ఇది క్రైస్తవులకు దేవునితో సమాధానమునిస్తుంది (రోమా 5:1). దేవుని మహిమలో పాలుపంచుకొనుటకు ఇది మనల్ని నిరీక్షింప చేస్తుంది (రోమా 5:2). ఇది మన జీవితములో "సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను

ఘనతను అక్షయతను వెదకు'' స్థలమునకు తీసుకు వెళ్ళును (రోమా 2:7; 5:3-5). పరిశుద్ధాత్మ సహవాసమును బట్టి ఇది మనకు దైవత్వముతో సహవాసమునిచ్చును (2 కొరింథీ. 13:14).

''ఆదామునందు'' వున్న మానవునిలో విశ్వాసము కలిగించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది. ఆదామునందు ఉన్న మనుష్యుడు, అనేక సమస్యల చేత పనిచేయని స్థితిలో ఉండి యున్న ఇంజిన్‌ను మరియు స్టార్ట్ చేయబడుటకు శక్తిలేని ఇంజిన్‌ను పోలియున్నాడు. తనకు తానుగా కదలుటకు అతనికి శక్తి లేదు. అతనికి సహాయము కావలెను. అలాగే ఒక బాహ్యమైన దాని నుండి శక్తి కావలెను. ఆదామునందున్న మనుష్యుడు సువార్త ద్వారా దేవుని నుండి బాహ్యమైన సహాయమును పొందును. అది విశ్వాసము యొక్క అగ్నిని మండించి మరణించిన వారిని జీవములోనికి నడిపించును (యోహాను 5:24). బాప్తిస్మము నందు అది వారిని యేసుక్రీస్తుతో ఆయన యొక్క మరణము, సమాధి మరియు పునరుత్థానములలో చేరుటకు వారిని నడిపించును.

ఇది ఆదామునందు ఉన్న మనుష్యునికి శుభవార్తయైయున్నది. 1 కొరింథీ. 15:1-4 చదువుము. మరణమును తప్పించుకొనుట సిలువ ద్వారా మాత్రమే తప్ప మరి ఏ ఇతర శుభవార్త ద్వారా గాని ఇతర మార్గము ద్వారా గాని సాధ్యపడదు. ''ఆదామునందు'' యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. మన పాపముల నిమిత్తము ఆయన ఒక పాపిగా చనిపోయెను. కాని దేవుడు తన శక్తి యొక్క మహిమ చేత ఆయనను మృతులలో నుండి లేపెను (రోమా 6:4; 2 కొరింథీ. 5:21).

ఆదామునందు ఉన్న మనుష్యుడు మరణములో, సమాధిలో మరియు పునరుత్థానములో తప్పక విశ్వాసమును కలిగియుండవలెను. కేవలం నీటిలో బాప్తిస్మము ద్వారానే అది అతని అంతరంగ పురుషునికి జరుగును. అలాగే దేవుడు అతనిని నూతన జీవమునకు నడిపించునని అతడు తప్పక నమ్మవలెను. ఈ సువార్త అంతయు ఆదామునందు ఉన్న మానవునికై దేవుడు కలిగియున్నాడు. ఒకవేళ ఇది విశ్వాసమును కలిగించని యెడల, మరొకశక్తి ఏదియు లేదు. మానవాళిని రక్షించుటకు దేవుడు సువార్త ద్వారా పిలుచుచున్నాడు.

దేవుని యెదుట మానవుడు కనుపరచుకొనుటకు అతడు తనకు తానుగా నీతిని కలిగియుండలేదు, గనుక మానవుడు విశ్వాసము చేత యేసునందు మాత్రమే దేవుడ్ని సంతోషపెట్టగలుగునట్లుగా దేవుడు నియమించెను. ఇందువలననే ఆదామునందు ఉన్న మనుష్యుడు విశ్వాసము కలిగియుండుట ఎంతో ప్రాముఖ్యమైనది. విశ్వాసమును కలుగజేయునది దేవుని సువార్తయే. అతడ్ని రక్షించుటకు దేవుడు ఉపయోగించు మరొక శక్తి ఏదియు లేదు.

క్రొత్త జన్మ ద్వారా మనము క్రీస్తులోనికి మారిన తరువాత మనలో విశ్వాసమును కలిగించుట కొనసాగించుటకు సువార్త శక్తిని కలిగియున్నది. రోమా 1:17 లో గ్రంథకర్త చెప్పుచున్నాడు, ''దేవుని నీతి సువార్తయందు బయలుపరచబడుచున్నది''. అది ఎలా బయలుపరచబడెను? ''విశ్వాసము నుండి విశ్వాసము వరకు'' అది బయలు పరచబడెను. **''నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును.''** లోకరాజ్యములోనుండి బయటకు వచ్చు మార్గము కేవలము నిజమైన విశ్వాసి కొరకు ఒక వృత్తాంతపు ప్రారంభమైయున్నది. ఇది క్రీస్తునందు దేవుని కుమారునివలె మహిమకు మార్గమైయున్నది.

దేవుని నీతి దేవుని గూర్చిన గొప్ప ప్రత్యక్షతయై యున్నది. ఇది సువార్తయందు బయలు పరచబడుచున్నది, కాని అది విశ్వాసము కలిగిన వారికి మాత్రమే. అది విశ్వాసము నుండి విశ్వాసమునకు బయలుపరచబడెను. అంటే మన విశ్వాసము వృద్ధి అగుచుండగా దేవుడు తన పరిశుద్ధతను మరియు నీతిని మరింతగా మనకు బయలు పరచుట కొనసాగించును. ఈ విశ్వాసము మానవుని యొక్క సహజ లక్షణము కాదు. కాని అది సువార్త చేత కలిగించబడుతుంది. మనలో విశ్వాసము మరింతగా కలుగవలెనంటే మనము తప్పకుండా సువార్త యొక్క విద్యార్థులమై యుండవలెను. విశ్వాసము మరింతగా కలుగునపుడు దేవుడు మరింతగా తనకు తానుగా బయలుపరచబడును (మత్తయి 5:48).

దేవుని నీతి అనగా ఏమిటి? ఇది దేవుడు ప్రతి పరిస్థితిలో జరిగించు మార్గమై యున్నది. ఇది ఆలోచించుటకు, పని చేయుటకు మరియు ఇతరుల గురించి భావించుటకును సరియైన మార్గమై యున్నది. యేసుక్రీస్తు యొక్క వ్యక్తిత్వములో మనము దేవుని స్వభావమును చూడగలము (హెబ్రీ. 1:3). మన విశ్వాసము ఈ మహిమగల వ్యక్తిని గూర్చి ఒక దృక్పథమును ఇచ్చును. యేసుక్రీస్తు యొక్క ప్రవర్తన అనునది దేవుని నీతి యొక్క ప్రత్యక్షతయైయున్నది. ఇది సువార్తయందు బయలు పరచబడెను. మనము ఇటువంటి వ్యక్తిత్వములో ఈ రకమైన ప్రవర్తనతో మన నెరవేర్పును చూడగలము.

మన విశ్వాసము మహిమ నుండి మహిమకు మారుటకై మనలను నడిపించును. లేదా మనము ఇలా చెప్పవచ్చు, మన విశ్వాసమునకు మనము విధేయులమైతే, విశ్వాసము నుండి విశ్వాసమునకు మారుటకై నడిపించును (రోమా 1:5).

> *ప్రభువే ఆత్మ. ప్రభువు యొక్క ఆత్మ యెక్కడ నుండునో అక్కడ స్వాతంత్ర్యము నుండును. మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము.* 
> *2 కొరింథీ. 3:17,18.*

ఇదంతయు సువార్తయందు ఉన్నది, విశ్వాసము కలిగియున్న వారికి ఇది కృపవలె ఇవ్వబడినది. ఇది మనలను లోకములోనుండి క్రీస్తులోనికి నడిపించును. ఇది ఆదాము స్వభావము నుండి మనలను కదల్చదు. ఇది దేవుని నీతి బయలు పరచబడిన క్రీస్తునందు

ఉన్నది. ఎంపికను బట్టి కాక ఆదాము స్వభావమును బట్టి మనము పాపులమై నప్పటికిని మన విశ్వాసమును బట్టి దేవుడు మనలను తన నీతియందు పాలుపొందు నట్లు అనుమతించును. సువార్త వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17).

సువార్తయందు బయలుపరచబడిన దేవుని నీతి మనలో విశ్వాసమును కలిగించుచున్నది, అందువలన మనము దేవుణ్ని సంతోషపెట్టి ఆయన సహవాసమందు ఆత్మచేత పాలు పొందగలము అని చెప్పుట చేత మనము సంక్షిప్తపరచగలము. మనము పాపమునకు లోనగువారమైనప్పటికిని దేవుని నీతియందు పాలుపొందగలము, అందువలన మన దుర్నీతిని ఆయన నీతిగా మార్చుకొనగలము.

రోమా పత్రికలో అపొస్తలుడైన పౌలు చేత బయలుపరచబడిన రీతిగా ఇది దేవుని కార్యక్రమమైయున్నది. కాలమునకు ముందు నిత్యత్వములో ఈ కార్యక్రమము ప్రారంభించబడినది. సువార్త వలన కలిగిన విశ్వాసము చేత మనము ఈ కార్య క్రమములో చేరుదుము; అయిననూ, కార్యక్రమము నిత్యత్వమునందు ఫలించును. దేవునికి స్తోత్రము!

## చర్చకోసం ప్రశ్నలు

1. రోమా పత్రిక యొక్క అంశము ఏమిటి?
2. లోకములో దేవునిశక్తి వాస్తవమైయున్నది. ఈ శక్తి మానవాళిపై ఎలా మోపబడినది?
3. దేవుని శక్తి ఒక వ్యక్తి అతని/ఆమె జీవితములో వాడబడునట్లుగా మానవిళిని హృదయము మరియు మనస్సునందు ఏమి వృద్ధి చెందవలెను?
4. యేసు, శక్తితో దేవుని కుమారునిగా ఎలా ప్రకటింపబడెను?
5. "మరణమునందు పాపము ఏలెను?" అను మాటను వివరింపుము.
6. ఆదామునందు ఉన్న మనుష్యుడు క్రీస్తును గుర్తించుటకు సువార్త ఏమి చేసెను?
7. అతడు/ఆమె యేసును గూర్చి చేయుటకు సువార్తయందున్న విశ్వాసము ఏమి చేయును?
8. "క్రీస్తునందు" క్రైస్తవుల కొరకు సువార్త యొక్క శక్తి పనిచేయుట ఎలా కొనసాగును?
9. ఒక క్రైస్తవుడు విశ్వాసమును వృద్ధి చేసుకొంటే అతడు దేవుని గూర్చి మంచి దృక్పథము కలిగియున్నాడని అర్థం. మన అభ్యాసము నుండి దేవునిని గూర్చి వివరించుము.
10. "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అను వాక్యము పట్ల మీ అవగాహన తెల్పుము?